

రసీదు లేని రూ.1.20 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసు శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. సోమవారం అంగళ్లులో పోలీసులు వాహనాల తనఖీ నిర్వహించి నగదును సీజ్ చేశారు. మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్లులో ఎన్నికల నిబంధనల దృష్ట్యా తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి కడప వైపు వెళుతున్న ఓ కారులో రూ.1.20 లక్షల నగదు పట్టుబడిందన్నారు. నగదుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లరాదన్నారు. ఒకవేళ నగదును తీసుకువెళ్లాల్సి ఉంటే తప్పనిసరిగా రసీదు కలిగి ఉండాలన్నారు.

మాధవరం 'ఆత్మహత్యల'పై సమగ్ర విచారణ చేపట్టాలి

- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- డిఎస్‌పి షరీఫ్ ప్రకటనపై అనుమానాలు
- నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కూతురు వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించి శిక్షించాలని, కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, పెద్ద కూతురు లక్ష్మిప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస క్లబ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు జి. లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, ఆప్ జిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా కృష్ణ, సిఆర్‌వి ప్రసాద్ హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అధికారులు, అధికార పార్టీ నేతల భూ ధన దాహానికి అమాయక కుటుంబం బలి కావడం విచారకరమన్నారు. మృతుడు సుబ్బారావు తండ్రి పాల చలపతి సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం అట్లూరు మండలంలోని భూములు, ఇల్లు త్యాగం చేసి, ఒంటిమిట్ట మండలంలోని మాధవరం గ్రామంలో నివాసం ఉంటూ, ఒంటిమిట్ట గ్రామ పొలంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకునేవారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదు చేయించుకున్న చలపతి కరోనా సమయంలో చనిపోయారని, తన రెండో కుమారుడైన సుబ్బారావు ఇద్దరూ కుమార్తెల చదువు, తమ్ముడు వివాహం, ఆర్థిక సమస్యలు ఒకవైపు, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి మరోవైపు రావడంతో తన తండ్రి ద్వారా సంక్రమించిన ఏకైక ఆస్తి మూడు ఎకరాల భూమిని విక్రయించైనా అప్పులు తీర్చు కుందామని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. అప్పుడే తహశీల్దార్, స్థానిక వైసిపి నాయకులు కుమ్మక్కై తన తండ్రి చలపతి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద నమోదు చేయడం దారుణమని తెలిపారు. అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపో వడం, లక్షల రూపాయలు లంచాలు ఇచ్చిన స్పందిం చకపోవడం వంటి కారణాలతో ఆత్మహత్యకు అప్పటి తహశీల్దార్ శిరీష కారణమయ్యారన్నారు. సదరు భూమి పక్కనే నాలుగు లైన్ల రహదారి నిర్మాణం ఉండడం వల్ల వీరి అనుభవంలో ఉన్న భూమి విలువ పెరగడం వల్ల అధికారులు అధికార పార్టీ నేతలు ఒక ప్రణాళిక అబద్ధంగానే భూమి వివరాలు నమోదు చేయడంలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ భూములను ఆక్రమించుకుని అమ్ముకుని సొమ్ము చేసుకుని సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఒకే భూమిపై రెండు హక్కు పత్రా లు తయారు చేసే డీకేటీ మాఫియా మండలంలో తయారయిందన్నారు. ఆత్మహత్య చేసుకున్నవారు రెవెన్యూ వారిపై రాసిన మరణ వాంగ్మూలాన్ని ప్రాతిపదికగా తీసుకొని పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ కాకున్నానే అప్పులు వ్యక్తిగత కారణాలతోనే సుబ్బారావు కుటుంబం చనిపోయినట్లు డిఎస్‌పి షరీఫ్ ప్రకటి ంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. ఈ కేసు పై జ్యుడిషియల్ ఎంక్వయిరీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాల న్నారు. కుటుంబానికి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, వారి భూమి వారికే ఇచ్చేవరకు పోరాటం కొన సాగించాలని, ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.వెంకట శివ, మహిళా సమాఖ్య బసి రున్నిసా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జి వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం సుబ్రహ్మణ్యం, ఇన్సాఫ్ కేసి బాదుల్లా, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, రైతు సంఘం దస్తగిరి రెడ్డి, మనోహర్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ బాలరాజు, చేనేత కార్మిక సంఘం పల్లా వరప్రసాద్, భాగ్యలక్ష్మి, గిరిజన సమాఖ్య బ్రహ్మం, ఆర్ బాబు, సిపిఐ ఒంటిమిట్ట మండల కార్యదర్శి యానాదయ్య పాల్గొన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : కర్నూలు ఎంపీ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్

పాల సుబ్బారావు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు సింగరి సంజీవ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తమాధవరంలో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను పద్మశాలి కుటుంబం నుంచి వచ్చానని, ఆత్మహత్యలకు తనను కలిచి వేశాయని పేర్కొన్నారు. ఇక్కడ పెత్తందారి వ్యవస్థ పేదల రక్తాన్నీ అన్నంలో కలుపుకొని తింటున్నాయని విమర్శించారు. ప్రభుత్వం కబ్జాదారులకు అండగా ఉంటూ పేదల ప్రాణాలను బలికుంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చెందిన సొంతభూమి అప్పగించి లక్ష్మిప్రసన్నకు ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే : కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మాజీ మంత్రి 'కొల్లు'

చేనేత కుటుంబం ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని, పాల సుబ్బారావు కుటుంబం రోడ్డున పడటానికి వైసిపి ప్రభుత్వమేనని టిడిపి నాయకులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం మాధవరంలోని మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఫోన్‌లో పాలసుబ్బారావు కుమార్తె లక్ష్మి ప్రసన్నను ఓదార్చి తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. ఆమెకు ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ చేనేత కుటుంబం ఆత్మహత్య మనసును కలచివేసిందని పేర్కొన్నారు. పాల చలపతి ఆస్తిని శ్రావణి పేరుతో రెవెన్యూ అధికారులు వైసిపి నాయకుడితో కుమ్మక్కై ఆన్‌లైన్‌లో ఎక్కించారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల దగాకు వైసిపి నాయకులే కారణమన్నారు. టిడిపి తరుపున బాధిత కుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపిస్తామని ఆయన చెప్పారు.

రెవెన్యూ అధికారులే కారణం : పిసిసి

మాధవరంలో చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుని మృతి చెందడానికి రెవెన్యూ అధికారులే కారణమని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆయన కుటుంబం మృతి చెందినట్లు ఓ వర్గం పక్క దారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సోమవారం పూల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాధవరంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు తండ్రి పేరుతో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట బదలాయించలేదా, అది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సుబ్బారావు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగడం వాస్తవం కాదా అన్నారు. సుబ్బారావు కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి స్థానికులు చెబుతున్న వాస్తవాలు వింటే ఆవేదన కలుగుతోందని పేర్కొన్నారు. భూదాహంతో ఓ నిండు కుటుంబాన్ని బలి తీసుకున్న అక్రమార్కులపై వెంటనే చర్యలు చేపట్టి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సుబ్బారావు కుమార్తె చదువులకు ప్రభుత్వం సహకరించి ఆ కుటుంబంపై ఉన్న అప్పుల ఒత్తిడి నుంచి కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సుబ్బారావు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాజంపేట పట్టణ అధ్యక్షులు కనిశెట్టి నరేష్, ఒంటిమిట్ట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిసిసి అధికార ప్రతినిధి పూలభాస్కర్

ఘనంగా శ్రీచౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

కడప సిటీ : శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం రాత్రి 11:50 గంటల నుండి సోమవారం ఉదయం 10:00 గంటల వరకు వైభవంగా నిర్వహించారు. జ్యోతి ఉత్సవ కమిటీ సభ్యులు పల్లా నరసింహారావు, వెలిగండ్ల ఎద్దుల కొండ్రాయుడు, వెలిగండ్ల కొండలరావు, వెలిగండ్ల సీతారామయ్య, పల్లా నాగేశ్వరరావు, గుజ్జల ప్రవీణ్, గుజ్జల గంగా మహేష్, గుజ్జల గంగిశెట్టి, కొరకూటి నరసింహ, యూత్, ఆధ్వర్యంలో వీరపు నాయినిపల్లె మండలం వెల్దుర్తి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలను గ్రామస్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ఉమ్మడ శెట్టి సుబ్రమణ్యం, కోశాధికారి టేకూరి సుదర్శన్, సుంకర రామచంద్రుడు, గుజ్జల పుల్లయ్య, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

వైభవంగా గిరి ప్రదక్షిణ వార్షికోత్సవం

చెన్నూరు : పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి కొండపై 10 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పునః ప్రారంభించి సంవత్సరం కావడంతో సోమవారం మొదటి వార్షికోత్సవాన్ని పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉదయం ప్రొద్దుటూరు వాస్తవ్యులు శ్రీ శివ దర్శినా నంద సరస్వతి మాతాజీ చేతులు మీదుగా ప్రారంభించారు. . ధర్మ పరిరక్షణ సమితి కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కడప ఆర్‌టిఇసి డిపో నుంచి చెన్నూరు మీదుగా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. చెన్నూరు కొత్త రోడ్డు నుంచి ఆధ్యాత్మికవేత్త స్వచ్ఛంద నిర్వాహకుడు. బుడ్డాయిపల్లి గ్రామానికి చెందిన ఆవుల బసిరెడ్డి భక్తుల కోసం వాహన సదుపాయం ఏర్పాటు చేశారు. చెన్నూరు మండలంతో పాటు వల్లూరు, ఖాజీపేట, మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం జిల్లా నలుమూలల నుంచి పుష్పగిరి గిరి ప్రదక్షిణ చేసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

'మేమంతా సిద్ధం'ను జయప్రదం చేయాలి

కడప : ప్రొద్దుటూరులో ఈనెల 27న నిర్వహించబోయే 'మేమంతా సిద్ధం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైసిపి అధ్యక్షులు కె. సురేష్ బాబు క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కడప, రాజంపేట పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్ సురేష్ బాబు, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు అప్పిరెడ్డి రాష్ట్ర ఐటీ విభాగ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సిద్ధవటం యానాదయ్య పాల్గొని మాట్లాడారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎన్‌డి విజయజ్యోతి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి -గోపవరం

బద్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌డి విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వివిధ పంచాయతీల నాయకులతో కలసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కానీ, కేంద్రంలో కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ అభయం కింద ప్రతి పేద మహిళలకు ప్రతినెలా రూ. 5వేలు ఇస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద సంవత్సరానికి రూ. లక్షల ఇస్తుందని పేర్కొన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణ మాఫీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, రామచంద్రారెడ్డి, సాంబయ్య, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

కలసపాడు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సగిలి మరియన్న (54) అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ , సిఐ చిరంజీవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హోమ్‌గార్డుగా పనిచేసిన మరియన్నకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బంధువులు, రాజకీయ ప్రముఖులు, పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

శ్రీసీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- ఏప్రిల్ 17 నుంచి శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు
- 22న శ్రీసీతారాముల కల్యాణం
- ఏర్పాట్ల సమీక్షలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 17 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు, 22న కల్యాణం అత్యంత వైభంగా నిర్వహించనున్నామని టిటటిడి జెఇఒ వీరబ్రహ్మం పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ విజయ రామరాజు, ఎస్‌పి సిద్ధార్థ్‌కౌశల్, జిల్లా యంత్రాంగంతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహి ంచాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 16న అంకురార్పణ, ఏప్రిల్ 17న శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 20న హనుమంత వాహనం, 21న గరుడవాహనం, 22న సీతారాముల కల్యా ణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. 23న రథోత్సవం, ఏప్రిల్ 25న చక్రస్నానం, 26న పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి, జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్‌టిసిబస్సులు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర విభాగాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ టిటిడి విజిలెన్స్ సిబ్బంది, జిల్లా పోలీసు యంత్రాంగం కలిసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాలలో సిసి కెమరాలు, కంట్రోల్ రూం ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, నరసింహ కిషోర్, ఎస్‌వి బిసి సిఇఒ శ్రీ షణ్ముఖ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, వివిధ శాఖల జిల్లా, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

'అభ్యుదయకవి వైసివి రెడ్డి'

ప్రజాశక్తి - కడప అర్బన్

విజ్ఞానదాయక, చురుకైన కవితలు, కథలు, కాలమ్స్ రాసిన గట్టిగింజల్లాంటి అభ్యుదయకవి వైసివి రెడ్డి అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వైసివిరెడ్డి 99వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించింది. ముందుగా ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి వైసివిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసివిరెడ్డిగా ప్రసిద్ధులైన యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి సమగ్ర సాహిత్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ప్రసిద్ధకవి కొడవలూరు రామచంద్రరాజు వద్ద మొదట సంప్రదాయ సాహిత్యంపై పట్టు సంపాదించారని పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ 'సరస్వతీపుత్ర' డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అంతటివాడు ప్రశంసించాడంటే వైసివి కవితాపాండిత్యాలు ఎంత గొప్పవో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఆయన మొదటి పద్యం గుత్తిలో విద్యార్థిగా ఉన్నప్పుడు రచించారని, కొన్ని అష్టావధానాలు చేసి మానివేశారన్నారు. కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ వైసివి రచించిన కడుపుమంట అనే కవితా ఖండిక ద్వారా ఆయన రచనా ప్రతిభను తెలియజేశారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, పాఠకులు రామ్ మదన్, ఆంజనేయులు, మహేష్, గంగాధర్, అశోక్‌రాజు, శ్రీరాములు, దిలీప్ పాల్గొన్నారు.



వైసివి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామప్రసాదరెడ్డి

రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ


కడప అర్బన్ : నగరంలోని కాగితాల పెంటలో ఉన్న కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో పవిత్రమైన రంజాన్ మాసోత్సవాలను పురస్కరించుకుని లజనతుల్ ఉలమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు సోమవారం రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆబిద్, డాక్టర్ రబ్బాని, డాక్టర్ ఇర్ఫాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ రంజాన్ రేషన్ పంపిణీ చేయడం ఆనవాయితీ వస్తోందన్నారు. దాదాపు 200 మందికి 17 రకాల నిత్యావసర సరుకులతో రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో లజనతుల్ ఉలమ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ మౌల్వి ఖాజి షేక్. మహమ్మద్ అలీ రషది, ప్రెసిడెంట్ మౌలానా హాఫీజ్ అస్గర్ అలీ, ముస్లిం ప్రముఖులు మౌలానా నూరుల్లా, మౌలానా బషీర్ సాబ్, ముఫ్తీ గౌస్ అహ్మద్ సాబ్, మౌలానా షాజాద్ హుసేని, హాఫీజ్ ఖాజి సిరాజ్ బుఖారి, యువ సోషల్ వర్కర్లు అక్రమ్, చాంద్ బాషా, ఖదీర్, అబ్దుల్లా పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

అంజాద్‌బాషాకు సన్మానం

కడప : మూడోసారి వైసిపి తరుపున సీటు దక్కించుకున్న అంజద్‌బాషాను బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డి. శ్రీరాములు శాలువా కప్పి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డి.శ్రీరాములు మాట్లాడుతూ అంజాద్‌బాషా కడప పట్టణంలో ప్రజల మధ్య అనునిత్యం ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేవారని, మనసున్న మానవత్వం కలిగిన మంచి వ్యక్తి అని కొనియాడారు. అన్ని కులాలతో పాటు అట్టడుగున ఉన్న బేడ బుడగజంగాలను ఎస్సీలుగా గుర్తించడానికి కేబినెట్‌లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం విషయంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఆయన్ను ముచ్చటగా మూడోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, సంక్షేమ సంఘం కుల నాయకులు డి.అల్లురయ్య, సి.పెంటయ్య, సి.చంద్రయ్య, డి.నాగరాజు, డి.దస్తగిరి, సి.గోవిందు, పి.సాయి, కె. మధు పాల్గొన్నారు.



అంజాద్‌బాషాను సన్మానిస్తున్న శ్రీరాములు

ఎంపీ చేతిలో పీడీ కీలుబొమ్మ : టిడిపి

ప్రజాశక్తి- కడప అర్బన్

వైసిపి ఎంపీ అవినాష్ రెడ్డి చెప్పినట్లు డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి ఆడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. సోమవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత తేదీలు వేసి ఉద్యోగులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. పీడీ అవినీతి పై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించి పీడీ పై చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వామా పీడీ ఎన్నికల కోడ్‌ను పాటించడం లేదని పేర్కొన్నారు. వైసిపి కోవర్ట్ యదుభూషణ్‌రెడ్డి అని ఆరోపించారు. కడపలో త్రీ స్టార్ పోలీసు ఉద్యోగి కనుసన్నల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. అశోక్ రెడ్డిని ఎన్నికల కు దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దోచుకో దాచుకో అన్న చందంగా అశోక్ రెడ్డి వ్యవహార శైలి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ అశోక్ రెడ్డి పై చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ కు సిఐ పై ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు పీరయ్య, జనార్ధన్, నాగరాజు పాల్గొన్నారు.

బిజెపిలోకి బొజ్జ రోషన్న

ప్రజాశక్తి-కడప అర్బన్

గతంలో బద్వేలు టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న బొజ్జ రోషన్న బిజెపిలో చేరారు. సోమవారం నగరంలోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శశి భూషణ్ రెడ్డి రోషన్నకు పార్టీ కండువా వేసి బిజెపిలోకి ఆహ్వానించారు. బద్వేలు టికెట్ బిజెపికి కేటాయించడంతో రోషన్న ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కడప జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు బొమ్మన సుబ్బారాయుడు, ఇతర బిజెపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

కడప అర్బన్ : రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా విచ్చలవిడిగా కొనసాగుతున్నా అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు ఘోరంగా విఫలమయ్యారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం తిరుమలేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన వైసిపి ప్రభుత్వం వారి జీవితాలను నాశనం చేసే డ్రగ్స్, గంజాయి, మద్యం, మదకద్రవ్యాలను అరికట్టలేకపోతుందని విమర్శించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం సప్లై చేస్తూ విద్యార్థి, యువత జీవితాలను నాశనం చేస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలోకి తీసుకువచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పెద్ద, పెద్ద నగరాలు, సిటీలలో దొరికే గంజాయి డ్రగ్స్ ను ఆంధ్రాలో ఇప్పుడు పల్లె, పల్లెలకు కళాశాలలకు, పాఠశాలలకు విస్తరింప చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపైనా, వారికి అండగా ఉండే రాజకీయ నాయకులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోజ్, నగర అధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు లోకేష్, టిడిపి నగర అధికార ప్రతినిధి జిల్లాని బాషా పులివెందుల అసెంబ్లీ అధ్యక్షులు సాయి కృష్ణ, నాయకులు మహేష్, శ్రీను పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
మంగళవారం (సా)	బుధవారం (ఉ)
6.30	5.01

మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - చక్రాయపేట

పులివెందుల నియోజకవర్గంలో అన్ని మండలాల కంటే చక్రాయపేట మండలంలో తెలుగుదేశం పార్టీ మెజారిటీ సాధిస్తుందని పులివెందుల టిడిపి అభ్యర్థి బిటెక్ రవి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అద్దాలమర్రి, కుమార్‌కాల్వ గ్రామాల్లో మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి, ఎద్దుల చంద్ర, చంద్రమౌళి నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వీరికి బాణ మేళాలు, పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం కుమార్ కాలువ దళితవాడ, గొల్లపల్లె, మాదిగపల్లె గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జయరాం నాయుడు, మాజీ జెడ్పిటిసి తుడుములదిన్నె రాధాకృష్ణయ్య, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, బిజెపి అధికార ప్రతినిధి పట్టం అశోక్‌కుమార్, రామాంజనేయరెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షుడు నరసింహులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు యోగీశ్వర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ రెడ్డి, పరమేశ్వర, రమేష్, సిరిశెట్టి వెంకటరమణ, బండారు హరి, రజత నాయుడు, విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



చెరుకువపల్లెలో రవికి స్వాగతం పలుకుతున్న నాయకులు

డ్రగ్స్ మాఫియా, గంజాయి విక్రయాల్లో ఏపి ఫస్ట్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) వైసిపి తన పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్ మాఫియా, గంజాయి విక్రయాల్లో ఫస్ట్ నిలిపిందని టిడిపి యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖను రాజధానిగా మారుస్తానన్న జగన్ నేడు డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేశాడని ఎద్దేవా చేశారు. విచారణ చేపట్టిన సిబిఐ అధికారులను రాష్ట్ర పోలీసులు నాలుగు రోజులపాటు విచారణ జరుగకుండా వారికి సహకరించకపోవడం ఎందుకు నిలువరించారో చెప్పాలన్నారు. డ్రగ్స్ కేసులో టిడిపికి సంబంధాలు ఉంటే ప్రభుత్వం, నాయకులు సాక్ష్యాలు ఎందుకు చూపడం లేదో ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, యువ నాయకులు బచ్చల వీర ప్రతాప్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అనుమానాస్పద వ్యక్తుల సంచారం

ఖాజీపేట : మండల పరిధిలోని పలు ఆలయాల్లో ఇటీవల చోరీ ఘటనలు ఎక్కువయ్యాయి. దుంపలగట్టు అంకాలమ్మ ఆలయం, భూమయపల్లె వద్ద ఉన్న భీమేశ్వర ఆలయంలో చోరీ ఘటనలు జరిగాయి. పలు ఆలయాల వద్ద సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా అనుమానాస్పద యువకులు సంచరిస్తున్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయని ఖాజీపేట సీఐ రామాంజులు సోమవారం తెలిపారు. వీరికి సంబంధించిన ఫోటోలను ఆయన మీడియాకు విడుదల చేశారు. అనుమానాస్పద యువకుల ఆచూకీ ఎవరికైనా తెలిసి ఉంటే సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో స్వామి వారి పల్లకీ సేవ

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో సోమవారం వీరభద్ర స్వామి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జల్లె వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జీఎం కిశోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన సిబ్బంది, అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించాలి

చాపాడు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ ఏడాది ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించాలని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన ఛైర్మన్ జల్లె వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం ఆయన మండల కమిటీ సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సర ప్రారంభ సందర్భంగా ఉత్సవాలను, ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె విజయ్‌కుమార్, మండల నాయకులు భవానీశంకర్, విశ్వేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామక్రిష్ణ, సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి మీ ముందుకు వచ్చానని, ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ జనంతో మమేకమయ్యారు. జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలన్నారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర రెడ్డి, గజ్జల లక్షుమయ్య, బడిగింజల చంద్రమౌళి, చంద్రారెడ్డి, నేతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- పెండ్లి పత్రికలు పంచుతూ ఘటన

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండల పరిధిలోని నడింపల్లి వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. ఒంటమిట్ట మండలం నడింపల్లెకు చెందిన లగమ గోపాల్‌రెడ్డి (70), ఆదిన రామచంద్రారెడ్డి (63) సోమవారం ఒంటిమిట్టలో పెండ్లి పత్రికలు పంచడానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చే సమయంలో నడింపల్లె వద్ద వారి బైక్‌ను కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 వాహనం ద్వారా ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గోపాల్‌రెడ్డి అప్పటికే మృతిచెందాడు. మరో వ్యక్తిని మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కాగా రామచంద్రారెడ్డి కుమారుడికి నాలుగు రోజుల్లో వివాహం ఉంది. పెండ్లిపత్రికలను పంచుతూ ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



మృతి చెందిన లగమ గోపాల్‌రెడ్డి

పుల్లూరు వాసి..

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు ఎస్టీ కాలనీకి చెందిన సురేష్ (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నెల్లూరు జిల్లా మర్రిపాడు సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నట్లు తెలిసింది. మృతుడు వృత్తిరీత్యా డ్రైవర్ అని గ్రామస్తులు తెలిపారు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఖాజీపేట సీఐ రామాంజులు తెలిపారు.



సురేష్ మృతదేహం

మోటర్ సైకిల్ చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్ వద్ద పార్క్ చేసిన మోటర్ సైకిల్ చోరీకి సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మలమడుగులోని నాగులకట్ట వీధికి చెందిన కాచన శ్రీకాంత్‌రెడ్డి ముద్దనూరు రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 22న తన మోటర్ సైకిల్‌ను స్థానిక రైల్వేస్టేషన్ వద్ద పార్క్ చేసి విధులకు వెళ్లాడు. విధులు ముగించుకుని రాత్రి స్టేషన్ వద్ద చూడగా పార్క్ చేసిన తన మోటర్ సైకిల్ కనిపించలేదు. ఆ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అడుగంటిన చెరువులు.. తాగునీటికి కష్టాలు..!

ప్రజాశక్తి - ఖాజీపేట

గతేడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల జలాశయాల్లో చుక్క నీరు లేక వెలవెల బోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఎడారులను తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన అడపాదడపా వర్షాల వల్ల కేసీ కెనాల్ ఆయకట్టుకు ఆరుతడి పంటలకు నీరివ్వడంతోపాటు తాగు నీటి అవసరాల దృష్ట్యా చెరువులకు అరకొరగా నీటిని నింపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయాయి. ఆయా గ్రామాల్లో తాగు నీటి కష్టాలు అధికమయ్యాయి. తాగు నీటి బోర్లల్లో చుక్క నీరు రావడం లేదు. చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని నింపి ఉంటే తాగు నీటికి కష్టాలు ఉండేవి కావని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పెన్నా నదిలో చుక్కనీరు లేకపోవడంతో పెన్నా తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు కూడా అరకొరగా అందుతోంది. గతంలో ఎన్నడూ లేనంత దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు వాపోతున్నారు. వేసవి ప్రారంభ దృష్ట్యా ముందుచూపు లేకపోవడం కూడా తాగునీటికి మరో కారణమని ప్రజలు భావిస్తున్నారు.



జలకళలేక వెలవెల బోతున్న రావులపల్లె చెరువు

పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి : ఎంపీ



పార్టీలో చేరిన వారితో ఎంపీ, సతీష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి నేత, మాజీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాల్లోని ఆయన అనుచరులు సోమవారం భారీ సంఖ్యలో టిడిపి నుండి వైసిపిలో చేరారు. వీరికి ఎంపీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నేటి నుండి ప్రతిరోజు వైసిపిలో చేరికలు మొదలవుతాయని తెలిపారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి వైసిపి కుటుంబం సాదరంగా స్వాగతం పలుకుతుందన్నారు. సతీష్‌రెడ్డి అన్న ఆలోచనలు తన ఆలోచనలు ఒకటే అన్నారు. సతీష్‌రెడ్డితో కలిసిన పని చేసిన వారందరు వైసిపిలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సతీష్‌రెడ్డి గౌరవపదమైన, సౌమ్యంగా ఉండే వ్యక్తి అని తెలిపారు. ఈనెల 27న ఇడుపులపాయలో ప్రారంభమయ్యే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపినేత సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వర ప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పలువురు టిడిపి నుండి వైసిపిలో చేరిక

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట 26 వార్డు, 31వ వార్డులకు సంబంధించి నగరిగుట్ట పరిధిలోని కౌన్సిలరు లక్ష్మీ ప్రసన్న, వైసిపి నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డి ఆధ్వర్యంలో కీర్తి శేషులు నాగస్వరం మహేష్ కుటుంబ సభ్యులు సుజాత, తరుణ్ చంద్ర, హర్ష భల్లె నారాయణ, ప్రసాద్ కుటుంబ సభ్యులు, క్రిస్టియన్ లైన్ సంబంధించి కోలా ప్రసాద్, అశోక్ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 50 కుటుంబాలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసం వద్ద వైసిపిలో చేరాయి. టిడిపి నుండి వైసిపిలో చేరిన వీరికి ఎంపీ, వైఎస్ మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అక్కడికి వచ్చిన పలువురి సమస్యలను విని వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వర ప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్ణయం సరైందికాదు

ప్రజాశక్తి - చాపాడు

విద్యుత్ అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆవుల వెంకటరమణ పేర్కొన్నారు. చాపాడు మండలం వెదురూరు రాజుపాలెం గ్రామంలో రైతుల కోరిక మేరకు ఆయన పర్యటించారు. 9 గంటల విద్యుత్‌కు బదులు 7 గంటలు కూడా అరకొరగా మాత్రమే సరఫరా చేస్తున్నారని వాపోయారు. గంటకు ఒకసారి లైన్‌కట్ అవుతుందని రైతులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో గోరుచుట్టుపై రోకటి పోటు అనేలా 7 గంటల కరెంటును కూడా నాలుగు గంటలకే మార్చడం భావ్యం కాదన్నారు. దీనిపై కడప జిల్లా విద్యుత్ అధికారులతో మాట్లాడగా పోట్లదుర్తి గ్రామం నుండి కడప వరకు పెన్నా నది తీర గ్రామాలకు విద్యుత్తును తగ్గించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారన్నారు. కడప పట్టణ ప్రజలకు తాగునీటి కోసం మైలవరం నుండి పెన్నా నది ద్వారా కడప చెరువుకు నీటిని తీసుకెళ్తున్నందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందన్నారు. పైరు పూతదశకు, పంట దశకు వచ్చే సమయంలో విద్యుత్ అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసుకొని రైతులకు ఏడు గంటల కరెంటు విధానాన్ని అమలు చేయాలని రైతు నాయకులు కోరారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు నియోజకవర్గ నాయకులు అహ్మద్, రాజుపాలెం రైతులు ఎంగిశెట్టి శ్రీధర్ బాబు, గోపాల్ రెడ్డి, తిరుపతి నరసింహ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, ప్రసాద్, శివ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

28 నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 28 నుంచి ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు జనవిజ్ఞానవేదిక (జెవివి) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శివారెడ్డి, సునీత తెలిపారు. స్థానిక జెవివి కార్యాలయంలో సోమవారం ఉచిత కోచింగ్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్ స్థానిక నందిని మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో ఇస్తామన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కోచింగ్ ఉంటుందన్నారు. కోచింగ్ తీసుకోదలచిన వారు 93987 22704కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ఇచ్చిన ఉచిత పాలీసెట్ కోచింగ్‌లో 507, 600, 1087, 3109, 3608, 5471, 7568తో పాటు మరిన్ని మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. అదే క్రమంలో ఈ సంవత్సరం కూడా కోచింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు గోపీనాథరెడ్డి, రాజశేఖర్, రాజేష్, సురేష్, మాబువలి, మురళిగుప్త, రవిశంకర్, ఉషారాణి, ప్రియాంక, కిరణ్, ప్రకాశ్, హేమలత, కల్యాణి, చంద్ర, మౌనిక, అక్షయ పాల్గొన్నారు.

సిఎం బస్సు యాత్రతో మట్టి తొలగింపు

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 27న బస్సు యాత్ర చేపట్టనున్న సందర్భంగా రోడ్డుపై ఉన్న మట్టిని అధికారులు తొలగిస్తున్నారు. ఇడుపుల పాయ నుండి వేంపల్లె మీదుగా సిఎం జగన్ బస్సు యాత్ర చేపట్టనున్నారు. పంచాయతీ అధికారులు రాయచోటి-వేంపల్లె ప్రధాన రహదారిపై ఉన్న మట్టిని డోజర్‌తో తొలగించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో రోడ్డుపై ఉన్న దుమ్మును నూకించారు. కొన్ని నెలల నుండి రోడ్డుపై ఉన్న దుమ్ముతో ప్రజలు, వ్యాపారులు, వాహన దారులు అల్లాడి పోయారు. రోడ్డుపై దుమ్ము లేకుండా చేయాలని పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు పలువురు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సిఎం వేంపల్లె మీదుగా బస్సు యాత్ర పెట్టడంతో రోడ్డుపై ఉన్న దుమ్మును అధికారులు తొలగించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులకు రోడ్డుపై మట్టి లేకుండా చేయడంతో వేంపల్లె ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డుపై ఉన్న మట్టిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - దువ్వూరు

రిజర్వు బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దువ్వూరులోని ఆదిశంకరాచార్య హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎపిజిబి రిటైర్డ్ బ్రాంచ్ మేనేజర్ ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్ ఎల్జీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ ఆర్థిక లావాదేవీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా బ్యాంకు ఖాతాదారులకు అమలు చేస్తున్న పలు రకాల స్కీములు, ఇన్సూరెన్స్ విషయాలపై అవగాహన కల్పించారు. రాటా సంస్థ అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు డిజిటల్ లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత ఫోన్ కాల్స్‌లో వచ్చే సందేశాలకు ఒటిపి చెప్పకూడదన్నారు. బయోమెట్రిక్‌లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెర్డ్స్ సంస్థ ప్రెసిడెంట్ కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ ఆర్‌బిఐ నియమాలను ప్రతి ఖాతాదారుడు తెలుసుకోవాలన్నారు. రాటా సంస్థ కళాకారులు ఆర్థిక అక్షరాస్యతపై ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు, రైతులు, వ్యాపారస్తులు, హెర్డ్స్ సిబ్బంది ఓబన్న, నాగరాజు, రైతు సంఘం నాయకులు వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

సిఎం బస్సు యాత్రకు భారీగా తరలి రావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఈనెల 27న ఇడుపులపాయ నుండి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపట్టే బస్సు యాత్రకు ప్రజలు భారీగా తరలి వచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధి వద్ద నుండి సిఎం బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. ఆ మేరకు నాయకులు, కార్యకర్తలు ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల నుండి వచ్చే ప్రజలందరికి పులివెందుల-కడప బైపాస్ రోడ్డులోని పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తోటలో భోజన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో ఎంపిపి లక్ష్మి గాయత్రి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, హజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్, యూత్ మండల కన్వీనర్ రవిశంకర్ గౌడ్, సతీష్‌రెడ్డి తనయుడు రోహన్ నాగిరెడ్డి, రామ చంద్రారెడ్డి, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఈ నెల 27న ప్రొద్దుటూరులో జరిగే జగనన్న బస్సు యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది వరకు కనీవినీ ఎరుగని రీతిలో ఈ బస్సు యాత్రలో ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్త, అభిమాని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, వైసిపి నాయకుడు కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి యోబు

చేనేత కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు చేనేత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక నాగులకట్ట వీధిలో సోమవారం నియోజకవర్గ కార్యదర్శి కంభం సంజీవతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రోజురోజుకూ భూఆక్రమణలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతూ వస్తున్నాయన్నారు. భాదితులు మానసిక వ్యథతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. ఒకరు చేనేత వర్గానికి చెందిన ఒంటిమిట్ట మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన సుబ్బారావు కుటుంబం బలైందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో భూ మాఫియా పెట్రేగి పోతోందన్నారు. అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించి, సుబ్బారావు లేఖను మరణ వాంగ్మూలంగా స్వీకరించి సంభందిత రెవెన్యూ అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో వీరనాల శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత సంఘం నాయకులు శివ నారాయణ



కాంగ్రెస్ ప్రచార సిడిని ఆవిష్కరిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

కాంగ్రెస్ ప్రచార ఆడియో సిడి ఆవిష్కరణ

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ప్రచార ఆడియో సిడిని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పిసిసి మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడియో సిడిలో పాటలతోపాటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలకు సంబంధించిన ప్రసంగాలు కూడా ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ రుణాలు మాఫీ, మహాలక్ష్మి పథకం కింద ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అమలవుతాయన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెసు మేనిఫెస్టోను సిడి ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు తులసిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, నిమ్మకాయల రాజా, రామకృష్ణ, బాలం సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, బద్రి, అమర్నాథ్‌రెడ్డి, మాస్, వినయ్, తిరుపాల్ రెడ్డి, వేమయ్య, సయ్యద్ మదార్ బాషా, రాజు, రవి, శివ పాల్గొన్నారు.

మైనార్టీల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

వేంపల్లె : ముస్లిం మైనార్టీల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా (మాస్)ను ఆ మండల శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, వేంపల్లెకు చెందిన మదార్ బాషాకు వేంపల్లె మండల మైనార్టీ ఛైర్మన్‌గా నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలకు వ్యతిరేకంగా పౌరసత్వం సవరణ చట్టం మొదలుకొని అనేక విధాన పరమైన నిర్ణయాలను తీసుకుందన్నారు. అలాంటి బిజెపితో పొత్తు కోసం రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన ప్రాకులాడడం సిగ్గుచేటన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్య, ఉద్యోగాల్లో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, రాజా, బద్రి, రవి, శివ, వేమయ్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

రంగు మారని నీటిని సరఫరా చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణ ప్రజలకు రంగుమారని తాగునీటిని సరఫరా చేయాలని సోమవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో కోరారు. కుళాయిలకు మురికినీరు వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో చాలా రోజులు నుండి మురికి నీరు తాగునీటి కుళాయిలలో వస్తున్నా మున్సిపాలిటీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు మంచినీరు పరిశుభ్రతకు వాడే కెమికల్ అయిపోయిందని చెబుతున్నారని తెలిపారు. చాలా రోజులు నుండి రంగుమారిన నీరు ఇలా వస్తుంటే ఇంకెప్పుడు వస్తుంది కెమికల్ అని ప్రశ్నించారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే ఆ భాధ్యత ఎవరిదన్నారు. మున్సిపాలిటీ అధికారులు మంచి నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రకటించిన ఒంటిపూట బడిని పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు పూర్తి వ్యతిరేకంగా వారికి ఇష్టానుసారం సాయంత్రం వరకు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తొమ్మిదో తరగతి ముగించుకున్న విద్యార్థులకు ఇప్పటి నుండే పదవ తరగతి పాఠ్యాంశాలు బోధిస్తూ పిల్లలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని అధికారులు ఆ పాఠశాలలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ప్రయివేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతూ వారికి ఊడిగం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒంటి పూట బడిని నిర్వహించని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మఠం మండలశాఖ అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు